క్లుప్తంగా

కందూర్‌లో హోలీ



అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో ఆదివారం గ్రామస్తులు హోలీ సంబరాలను నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి రథోత్సవం పూర్తయిన మరుసటి రోజు గ్రామంలో హోలీ పండగను జరుపుకోవడం పురాతన కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి రంగు నీళ్లను మట్టికుండల్లో గ్రామానికి తీసుకొచ్చారు. తప్పెట్లు కొడుతూ గ్రామంలోని ఇతర ఆలయాల్లో రంగు నీళ్లను చల్లారు. అనంతరం గ్రామస్తులు హోలీని జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు రంగులు చల్లుకొని నృత్యాలు చేశారు. గ్రామస్తులు శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్దకు వెళ్లి అక్కడ స్వామివారి త్రిశూల కార్యక్రమంలో పాల్గొన్నారు.

లోకిరేవులో సామూహిక వీరభద్ర వ్రతం



నవాబుపేట: మండలంలోని లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయ పీఠాధిపతి లింగయ్యస్వామి ఆధ్వర్యంలో ఆదివారం 155మంది దంపతులతో కలిసి సామూహిక వీరభద్రవ్రతం చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రవచనాలు, ప్రసాదాలు భక్తులు అందుకున్నారు. ఓంవీరభద్రయ్య నమహ అంటూ వీరభద్రస్వామి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయంలో మేత్కుపల్లి ఉమాపత్యస్వామి రచించిన శ్రీవీరభద్రవ్రతకల్పం అనే గ్రంథాన్ని చెన్నబసవ మహాస్వామి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తితో మనిషి ఆయుషు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవాలయ పూజారి వీరభద్రయ్యస్వామి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

19 నుంచి సప్తమదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని శ్రీద్వారకామాయి బాబా మందిరం సప్తమదశ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం కాగడ హారతి, మహాగణపతిపూజ, అఖండ దీపారాధన, బాబావారికి రుద్రాభిషేకం, సాయంత్రం ప్రదోషకాల పూజ, సాయి సంధ్యాహారతి, 20న ఏకాదశ రుద్ర పారాయణంతో అష్టోత్త శత క్షీర కుంభాభిషేకం, పుష్పార్చన, మహా మంగళహారతి, పల్లకీసేవ ఊరేగింపు, 21న కాగడహారతి, అమ్మవారులకు విశేష అభిషేకాలు, నవగ్రహ, పాశుపత హోమం, ప్రదోషకాల పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జమాతే ఉల్ హింద్ పర్సనల్‌లా బోర్డు తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయపార్టీలు తమ వైఖరి చెప్పాలని కోరారు. దేశంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు పార్లమెంట్‌లో బిల్లుకు వ్యతిరేకంగా తమగళం వినిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈనిరసనలో ముస్లిం మైనార్టీలు, లౌకికవాదులు, మేధావులు పాల్గొనాలని కోరారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: స్థానిక సంతలో ఆదివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సంతకొచ్చిన వివిధ గ్రామాల ప్రజలు మధ్యాహ్న భోజనం చేశారు. దాదాపు 28వారాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, రఘువీర్‌శర్మ, నిరంజన్, నసీర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సుజిత్‌యాదవ్

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పార్వతి సుజిత్‌యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ నియామక పత్రం అందజేశారు.

ఫుట్‌పాత్‌లు మాయం





జడ్చర్లలో మోర్ ఎదురుగా రోడ్డుపై ఆక్రమణలు

రోడ్లపైనే కొనసాగుతున్న వ్యాపారాలు
- పాదచారులకు తప్పని తిప్పలు
- అద్దె దండుకుంటున్న ఘనులు
- పట్టించుకోని అధికారులు
- సమావేశాల్లోనే గళమెత్తుతున్న కౌన్సిలర్లు
- అనంతరం అన్ని బుట్టదాఖలు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీ గుండా వెళ్తున్న 167వ నంబర్ జాతీయరహదారి పొడుగునా ఉన్న ఫుట్‌పాత్‌లు మాయమైపోతున్నాయి. దీంతో పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు. ఫార్మా సెజ్ కారణంగా రోజురోజుకూ జడ్చర్లలో ట్రాఫిక్ పెరుగుతూ వస్తోంది. జనాభా సైతం ప్రతి ఏటా గణనీయంగా పెరుగుతుంది. ఇందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగడం లేదు. దీంతో జడ్చర్ల ట్రాఫిక్ ఓ పద్మవ్యూహంలా మారింది. వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. 167వ నంబరు జాతీయ రహదారిపై హౌసింగ్‌బోర్డు కాలనీ మొదలు ఏరియా ఆస్పత్రి వరకు రోడ్డు వెంట ఉన్న ఫుట్‌పాత్, దీంతోపాటు పాదచారులు నడవటానికి వీలుగా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఈ రెండు పూర్తిగా మాయమయ్యాయి. కొన్ని చోట్ల రోడ్డు విస్తరణ సమయంలోనే పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా రోడ్డు వేశారు. ఆ కొంత ప్రాంతం మినహాయిస్తే మిగిలిన ప్రాంతమంతా ఆక్రమణలకు గురవుతూనే ఉంది. రోడ్లపై వ్యాపారాలు చేస్తుండటంతో వారి వద్దకు వచ్చే కొనుగోలు దారుల ద్విచక్రవాహనాలు రోడ్డు మధ్య వరకు వస్తున్నాయి.



ఆక్రమణలు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ (ఫైల్)

అడ్డా మాది అంటూ దబాయింపు

జాతీయరహదారి పొడుగునా ఫుట్‌పాత్‌పై చేసే వ్యాపారులు వేలల్లో అద్దెలను చెల్లిస్తున్నారు. మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణాల వద్ద దోపిడీ పరాకాష్టకు చేరిందనే చెప్పాలి. రూ.6వేల అద్దె చెల్లించే కాంప్లెక్స్ అద్దె దారులు దుకాణాల ఎదరుగా ఇతర వ్యాపారులను పోషిస్తూ రోడ్డు ఆక్రమించి వేలల్లో అద్దెలు దండుకుంటున్నారు. రోడ్డును ఆక్రమిస్తూ వేలల్లో అద్దెలు దండుకుంటున్నారు. అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఫుట్‌పాత్, మురికి కాల్వలపై చేసే వ్యాపారులతో వేలల్లో కొందరు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అడ్డా మాది అంటూ దబాయిస్తుండటం విశేషం. జడ్చర్ల కొత్త బస్టాండ్ ప్రాంగణంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్టీసీకి అద్దె నామమాత్రంగా చెల్లిస్తూ ఇతర వ్యాపారులను ప్రోత్సహిస్తూ పెద్ద మొత్తంలో అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. ఇలా ప్రభుత్వ స్థలాలకు పెద్ద మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. ఫుట్‌పాత్, మురికికాల్వలు, పాదచారులు వెళ్లే ప్రాంతం పూర్తిగా ఆక్రమణలకు గురి కావటంతో రోజు సమస్యలు వస్తూనే ఉన్నాయి. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గళమెత్తే కౌన్సిలర్లు తరువాత పట్టించుకోకుండా ఉన్నారు. ఇప్పటికైనా ఫుట్‌పాత్, మురికికాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి చిరు వ్యాపారులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. వేలల్లో అద్దెలు దండుకుంటున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ట్రాఫిక్ సమస్య వాస్తవమే

12వ వార్డులో రోడ్డుపై వ్యాపారాలు అధికమయ్యాయి. ప్రధానంగా ఎంపీడీఓ కాంప్లెక్స్, ఎదురుగా హోటల్‌వద్ద రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది వాస్తవమే. హోటళ్లు, చిరువ్యాపారులు రోడ్డుపైకి రావటం ఇబ్బందిగా ఉంది. ఇదే విషయమై కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకెళ్లాను. రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

– రఘురాంగౌడ్, 12వ వార్డు కౌన్సిలర్

ఫుట్‌పాత్‌ల విషయంలో చర్యలు

ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురైన విషయాన్ని కౌన్సిలర్లు ఫిర్యాదులు చేస్తున్నది వాస్తవమే. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకునేందుకు సమయం పడుతుంది. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ, పన్నుల వసూళ్లలో సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ఏప్రిల్ మొదటి వారంలో వాటిపై దృష్టిసారిస్తాం. ఫుట్‌పాత్ చిరువ్యాపారులపై అద్దెలు తీసుకోవటం సరైంది కాదు. అలాంటివి గుర్తించి తొలగించేందుకు కృషిచేస్తాం.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, మున్సిపాలిటీ

విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యం

- భవిష్యత్‌లో సమ్యలు రాకుండా చర్యలు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- పెద్దరేవల్లిలో ప్రత్యేక ఫీడర్ ప్రారంభం



ప్రత్యేక ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: నియోజకవర్గంలో విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పెద్దరేవల్లి గ్రామానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా అయ్యేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక ఫీడర్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేశామని, త్వరలోనే పనులు పూర్తిచేసి వాటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కొత్తగా 132 కేవీ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ పాలనలో కొత్తగా సబ్‌స్టేషన్లను ఏర్పాటుచేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.

గ్రామదేవతకు పూజలు

జడ్చర్ల మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బొడ్రాయి పండుగలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.గ్రామ దేవతకు పూజలు చేసి గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మిడ్జిల్: మండలంలోని దోనూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి భూమి పూజ చేశారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మున్ననూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తామన్నారు. నాయకులు సాయిలు, వెంకటయ్య, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, విజయ్, కృష్ణయ్యగౌడ్, సత్యం పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



షాసాబ్‌గుట్టలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న చల్లా వంశీచంద్‌రెడ్డి, కొత్వాల్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొనిముస్లింలకు ఆదివారం పలు మసీదులతో పాటు కాలనీల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటుచేశారు. షాసాబ్‌గుట్టలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినవిందులో సీడబ్ల్యూసీ శాశ్వత ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, జహీర్ అక్తర్, అజ్మత్‌అలీ పాల్గొన్నారు. మైనార్టీ బాలుర-2 గురుకులంలో ఏర్పాటుచేసిన విందులో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ పాల్గొన్నారు. షాసాబ్‌గుట్టలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం భవన్‌లో ఏర్పాటుచేసిన విందులో లక్ష్మణ్‌గౌడ్, బాలయ్య యాదవ్, షేక్ ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ వహీద్‌షా, రాధాకృష్ణారెడ్డి, వెంకటనారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

పండుగలు మత సామరస్యానికి ప్రతీకలు

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: పండగలు మతసామరస్యానికి ప్రతీకలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మసీదులో ఆదివారం సాయంత్రం జరిగి ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. ఉపవాస దీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు. అనంతరం జరిగిన విందులో పాల్గొన్నారు. స్థానిక బీసీ కాలనీలో హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు అరవింద్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, భీమన్నయాదవ్, దశరథ్‌రెడ్డి, సయ్యద్‌షఫి, శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, బుచ్చన్నగౌడ్, హన్మంతు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దేవరకద్ర: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 149 మంది రైతులకు 75 శాతం సబ్సిడీపై స్పింకర్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసమే పనిచేస్తుందన్నారు. పంటలు ఎండిపోకుండా సాగునీటిని అందించడానికి నిరంతరం కృషిచేస్తున్నామని తెలిపారు. కర్నాటక సీఎంతో మాట్లాడి జూరాలకు నీటిని తీసుకువచ్చామని, అలాగే జూరాల నుంచి ఫర్దీపూర్ రిజర్వాయర్‌కు నీటిని అందిస్తామన్నారు. కోయిల్‌సాగర్ చరిత్రలోనే ఇలా నీటిని తీసుకురావడం మొదటిసారని ఈవిషయం అందిరికీ తెలుసన్నారు. ఇటీవలే రైతుల ఇబ్బందులు తెలుసుకొని వంద ట్రాన్స్‌ఫార్మర్లను అందజేసినట్లు తెలిపారు. హార్టికల్చర్ జిల్లా అధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, మార్కెట్ చైర్మన్ కతలప్ప, అరవింద్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా గణపతి స్వస్తి పూజ



దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాల సముదాయంలో ఆదివారం మహాగణపతి స్వస్తి పూజ ఘనంగా నిర్వహించారు. దేవాలయాల పునర్నిర్మాణం పూజల్లో భాగంగా మహా గణపతి స్వస్తి పుణ్యవచనం, నవగ్రహారాధన, సర్వ దేవత హవనం, నాగదేవత నవగ్రహాల విగ్రహ సంస్కారం, కుంభంలోకి విగ్రహాల కళావాహనం కార్యక్రమాలు నిర్వహించారు.

రూ. 2.51 లక్ష విరాళం..

ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయ పునర్నిర్మాణం కార్యక్రమం కోసం దివంగత కల్వ ఈశ్వరమ్మ, కల్ల శ్రీనివాసులు జ్ఞాపకార్థం వారి కుమారులు కల్వ కన్నయ్య, కల్వ నరేష్, కల్ల ఈశ్వర్, కల్ల రఘురాం దేవాలయానికి రూ. 2, 51,118 ను ఆదివారం అందజేశారు.

పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి



జడ్చర్ల టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని ఆదివారం వాసవీకమాన్ వద్ద ఆర్యవైశ్యసంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోరాట పటిమను పొట్టి శ్రీరాములు ద్వారా స్ఫూర్తి పొందాలని వక్తలు పిలుపునిచ్చారు. దాచేపల్లి చంద్రయ్య, కొత్రమధు, మేడిశెట్టి రామకృష్ణ, మురళీకృష్ణ, అమరవాదిప్రభు, జ్యోతి, లక్ష్మి, శివరేఖ పాల్గొన్నారు.

తప్పుడు హామీలిచ్చిన కాంగ్రెస్



శ్రీనివాస్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కే. చంద్రశేఖర్‌రావును హైదరాబాద్‌లో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ జిల్లాఅధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ మాజీమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీచైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణాధ్యక్షుడు శివరాజ్, మాజీఎంపీపీ సుధాశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

హన్వాడ: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా టంకరలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. నాగినోనిపల్లిలో మాజీ సర్పంచ్ చిన్న చెన్నారెడ్డి ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో పార్టీ నాయకులు కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. వృద్ధులు, పిల్లలకు అరటిపండ్లు పంపిణీ చేశారు.

ఐదున్నర తులాల బంగారం అపహరణ

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోయారు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. శేషాద్రినగర్‌కు చెందిన అబ్దుల్ ముజీబ్ శనివారం హైదరాబాద్ వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికొచ్చాడు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో పాటు బీరువా తాళం పగిలిపోయి ఉంది. ఐదున్నర తులాల బంగారం, రూ.80వేల నగదును అపహరించారు. ఇంట్లో ఎ వరూలేనిది చూసి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదు ఇచ్చాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



రిలే దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు మైలారం శ్రీరాములు, పోలే బాలయ్య, బాలరాజు, కొండయ్య, కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

జడ్చర్ల టౌన్: వర్గీకరణ అమలు చేశాకనే గ్రూప్ ఉద్యోగాలు భర్తీచేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. మున్సిపాలిట పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న దీక్షలను ఎంఎస్‌పీ నాయకులు ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు జంగయ్య మాదిగ, కరాటే శ్రీను, దగ్గుల బాల్‌రాజ్, కొంగళి నాగరాజు, జంగన్న, శ్యాం, సత్యం, గోపాల్‌రావు, యాదయ్య, కావలి కృష్ణయ్య, జీవన్, లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం



క్రీడాకారులతో మాట్లాడుతున్న నిర్వాహకులు

నవాబుపేట: మండలంలోని పల్లెగడ్డ సమీపంలో వేలసిన స్వయంభూ ఆదిబసవేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నందికోలసేవ నిర్వహించిన శివభక్తులు అగ్నిలో నడుస్తూ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామివారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

జాతరలో భాగంగా బసవేశ్వర దేవాలయం ఆవరణలో పల్లెగడ్డ యూత్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 27జట్లు పాల్గొనగా ఈటోర్నీ రెండు రోజులు జరగనుంది. విజేతలకు మాజీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్, సత్యం, రాములు, నేషనల్ రెఫరీ మల్లేష్, స్టేట్ కోచ్ ముస్తఫా, శ్రీనివాస్, బాల్‌రాజ్, శివ, గోపాల్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఓపెన్ యూనివర్సిటీ ఒక వరం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నత విద్య చదవడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక వరమని అధ్యాపకులు రాములు, నరసింహాచారి, మాలిక్‌పాషా, ఎల్లప్ప, కిరణ్మయి, కృష్ణవేణి అన్నారు. ఆదివారం క్రిస్టియన్‌పల్లిలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎంవీఎస్ కాలేజీ స్టడీ సెంటర్‌లో పొలిటికల్ సైన్స్ సెకండియర్ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనివార్య కారణాలతో ఉన్నత విద్యను అభ్యసించలేక మధ్యలోనే ఆపేసిన విద్యార్థులకు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. పద్మావతి, స్టడీసెంటర్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ మాట్లాడారు. సిబ్బంది రఘువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, విద్యార్థులు కృష్ణయాదవ్, శంకర్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రాధిక, మాధవి, అమృత, సుధ, స్వాతి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 2009-10 ఏడాది విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను పిలిచి వారిని సత్కరించారు. తమ ఉన్నతికి కారణమైన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. గత స్మృతులు గుర్తుకు చేసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులను తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ మంజులాదేవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు నయీమొద్దీన్, జమీలాబేగం, రాజేశ్వరి మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించటమే గురుదక్షిణగా అభిప్రాయపడ్డారు. గురువులను పుష్పాలు చల్లుతూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇబ్రహీం, రమణాచార్యులు, అనసూయ, జనార్దన్, రాములుతోపాటు పూర్వ విద్యార్థులు మౌనిక, రవితేజ, సంజు, శంకర్, శేఖర్, స్వాతి, శ్రీదేవి, లలిత, మల్లేష్, రామకృష్ణ, సురేష్, అనిత, మంజుల, ప్రణీత, ఉస్మాన్ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హన్వాడ: పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారమిచ్చి ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని యారోనిపల్లి, మాధార ం, మునిమోక్షం, తిరుమలగిరి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు పర్యటించారు. ఆయా గ్రామాల శివార్లలో సాగవుతున్న పంటలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. ఈఏడాదిలో వర్షాలు సమృద్ధిగా కురిసినా మార్చిలోనే భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు రాక పంటలు ఎండిపోయినట్లు వివరించారు. ప్రభుత్వం స్పందించి ఎండిన పంటలను సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్, మండల కార్యదర్శి లక్ష్మయ్య, సీపీఎం మండల నాయకులు రాములు, ర్యాకమయ్య, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ఏఎస్ఐ అంజిలయ్య ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. పలు వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్ కండిషన్ తనిఖీ చేసి 5 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఏఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కేసులు పునరావృతం అయితే వాహనాన్ని సీజ్ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.